ఘనంగా గీతా జయంతి ఉత్సవాలు



సుభాష్‌నగర్: సూరారంలోని నార్త్ సిటీ హై స్కూల్‌లో గీతా జయంతిని గురువారం ఘనంగా జరిపారు. భగవద్గీత యొక్క గొప్పదనాన్ని హైస్కూల్ ప్రిన్సిపాల్ కోలా వెంకటేష్, సీనియర్ ఉపాధ్యాయుడు విద్యనాథ్ విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పుస్తకాన్ని చదవాలన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాలపై కొంపల్లి మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. కొంపల్లి మున్సిపల్ 10వ వార్డులోని విజయసింహ లేఅవుట్‌లో రోడ్డు స్థలాన్ని ఆక్రమించి 500 గజాల్లో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణంపై కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు గురువారం సదరు అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

శ్రీదత్తాత్రేయ స్వామికి విశేష పూజలు

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కొలువుదీరిన శ్రీదత్తాత్రేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణతో పాటు స్వామివారికి అభిషేకం, అర్చన, హారతి, ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో అర్చకులు జయంతి ఉత్సవాలను వైభవంగా జరుపుతున్నారు.

బస్సుల్లేవ్.. ఆటోలే దిక్కు!

ప్రజలను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రం మేడ్చల్‌కు వెళ్లాలంటే బస్సులు లేవంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తోంది. పటాన్‌చెరు నుంచి జిల్లా కేంద్రానికి ఉదయం వేళలో.. అది కూడా ఒక్క బస్సు మాత్రమే ఉంది. బస్సులు లేక కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, సామాన్యుల బాధలు అంతా ఇంతా కావు. ఇతర రూట్‌ల నుంచి అయినా బస్సులో జిల్లా కేంద్రానికి వెళ్దామంటే కూర్చోడానికి సీటు కాదు కదా.. కనీసం కాలు పెట్టే సందు కూడా ఉండటం లేదు. జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 3, 4 బస్సులు మారాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. – నిజాంపేట్

- గండిమైసమ్మ చౌరస్తా నుంచి మేడ్చల్‌కు బస్సులు లేక సతమతం
- తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు
- మేడ్చల్ వెళ్లాలంటే 3, 4 బస్సులు మారాల్సిందే..



ప్రగతినగర్ కమాన్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు



సరిపడా బస్సులు లేక ఫుట్ బోర్డుపై ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

జిల్లా కేంద్రానికి ఒక్క బస్సేనా?

జిల్లా కేంద్రమైన మేడ్చల్‌కు కేవలం పటాన్ చెరువు నుంచి ఉదయం 8:30 గంటల సమయంలో ఒకే ఒక్క బస్సు సర్వీసు ఉంది. మియాపూర్ మొదలు కొని బాచుపల్లి, మల్లంపేట్, నిజాంపేట్, ప్రగతినగర్, దుండిగల్, కూకట్ పల్లి, శేరిలింగంపల్లి, భౌరంపేట్, దుండిగల్, దూలపల్లి, మైసమ్మగూడ, మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ చదువుల కోసం విద్యార్థులు ప్రతి రోజు ఆర్టీసి బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. అయితే జిల్లా కేంద్రమైన మేడ్చల్ వరకు విద్యార్థులు వెళ్లాలంటే గండిమైసమ్మ వరకు ఒక బస్సు, అక్కడి నుంచి బహదూర్‌పల్లి వరకు మరో బస్సు, అక్కడి నుంచి మరో బస్సులో కొంపల్లి వరకు, అక్కడి నుంచి మేడ్చల్‌కు మరో బస్సులో వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మేడ్చల్ జిల్లాలోని బాచుపల్లి, దుండిగల్, కుత్బుల్లాపూర్ మండలాలకు చెందిన ప్రజలు ఇదే రూట్‌లో వెళ్లాల్సిందే. జిల్లాతో పాటు పక్కనే ఉన్న రంగారెడ్డి జిల్లాలోని మియాపూర్, శేరిలింగంపల్లి, సంగారెడ్డి జిల్లా నుంచి సైతం విద్యార్థులు ఇదే రూట్‌లో తమ కాలేజీలకు వెళ్తుంటారు.



ఆటోలో ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

గండిమైసమ్మ చౌరస్తా వరకే..

మియాపూర్ మీదుగా గండిమైసమ్మ చౌరస్తా వరకు చాలా బస్సు సర్వీసులను వివిధ డిపోలు నడుపుతున్నాయి. ఇక్కడి వరకు చాలా బస్సులు ఉన్నా.. జిల్లా కేంద్రానికి కేవలం రోజులో ఒక్క బస్సే నడపడం బాధాకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండిమైసమ్మ చౌరస్తా నుంచి మరికొన్ని బస్సులను జిల్లా కేంద్రానికి కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు. మేడ్చల్ వైపు ప్రయాణించాలంటే గండిమైసమ్మ చౌరస్తా నుంచి బహదూర్ పల్లి, అక్కడి నుంచి కొంపల్లి, అక్కడి నుంచి మేడ్చల్ వరకు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉంది.

ఏ మార్గంలోనైనా బస్ సౌకర్యం..

గండిమైసమ్మ చౌరస్తా నుంచి జిల్లా కేంద్రమైన మేడ్చల్‌కు వెళ్లాలంటే రెండు రోడ్డు మార్గాలు ఉన్నాయి. ఒకటి గండిమైసమ్మ చౌరస్తా నుంచి బహదూర్‌పల్లి, దూలపల్లి, కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు వెళ్లవచ్చు. జిల్లా కేంద్రానికి డైరెక్ట్ బస్సులు లేవు. మూడు బస్సులు మారితే వెళ్లవచ్చు. ఇలా ప్రయాణం చేయాలంటే సుమారు 22 కిలో మీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి ఉంటుంది. గంట సమయం వరకు పడుతుంది. ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే మరో అరగంట ఆలస్యం అవుతుంది. మరొక రోడ్డు మార్గం.. గండిమైసమ్మ చౌరాస్తా నుంచి బాసరగడి గ్రామం, అయోధ్య చౌరస్తా, సుతారి గూడెం చౌరస్తా, సుతారి గూడెం గ్రామం, చెక్ పోస్ట్ మీదుగా మేడ్చల్‌కు వెళ్లవచ్చు. ఈ రోడ్డు మార్గంలో ఒక్కటంటే ఒక్క బస్సు సర్వీసు కూడా లేదు. ఈ రోడ్డు మార్గం కేవలం 12 కిలో మీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. కేవలం 20 నిమిషాల నుంచి 30 నిమిషాల్లో జిల్లా కేంద్రానికి వెళ్లవచ్చు. ప్రయాణికులకు దూరంతో పాటు సమయం కలిసి వచ్చే మార్గంలో బస్సులను నడపడంలో ఆర్టీసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు సైతం ఈ సమస్యపై దృష్టి పెట్టకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ బస్సు సర్వీసులు గండిమైసమ్మ చౌరస్తా నుంచి ఉన్న రెండు మార్గాల్లో కొనసాగించాలని ప్రయాణికులు వేడుకుంటున్నారు.

25 కిలోమీటర్లు అదనంగా వెళ్లాల్సి వస్తోంది



బాచుపల్లి నుంచి మేడ్చల్ కలెక్టర్ కార్యాలయం వెళ్లడానికి కూకట్‌పల్లి నుంచి అల్వాల్ మీదుగా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. బాచుపల్లి నుంచి 20 కిలో మీటర్లు దూరంలో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయానికి బస్సులు లేకపోవడంతో సుమారు 45 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తున్నా. అదనంగా 25కిలో మీటర్లు ప్రయాణించడం ద్వారా సమయం వృథా అవుతోంది. మియాపూర్ నుంచైనా, గండిమైసమ్మ చౌరస్తా నుంచి అయినా మేడ్చల్ కలెక్టర్ కార్యాలయానికి బస్సులు కొనసాగిస్తే చాలా మందికి ఉపయోగంగా ఉంటుంది.

– జీతయ్య, కలెక్టరేట్ ఉద్యోగి, బాచుపల్లి

మేడ్చల్ వెళ్లడానికి బస్సులే లేవు...



మేడ్చల్, కలెక్టర్ కార్యాలయం వరకు కూడా బస్సులు లేవు. కలెక్టర్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడికి వెళ్లాలంటే నాలుగు బస్సులు మారాల్సి ఉంది. అధికారులు ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి జిల్లా కేంద్రానికి బస్సు సర్వీసులు కొనసాగించాలి.

– మహ్మద్ జహంగీర్, ప్రగతినగర్

ముమ్మరంగా సర్వే వివరాల నమోదు

కుత్బుల్లాపూర్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచే విధంగా సర్కిల్ అధికారులు ప్రత్యేక సిబ్బందితో చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెలాఖరు వరకు సుమారు లక్షన్నరకు పైగా ఉన్న దరఖాస్తులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి తెలిపారు. సుమారు 200 మందితో ఈ రెండు సర్కిళ్ల పరిధిలో ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైరి మల్లేష్‌గౌడ్‌కు ఘన నివాళి



లేఖను అందుకుంటున్న బైరి భాస్కర్‌గౌడ్

సుభాష్‌నగర్: కాంగ్రెస్ సీనియర్ నేత, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బైరి భాస్కర్‌గౌడ్ తండ్రి బైరి మల్లేష్‌గౌడ్ ఇటీవల గుండె నొప్పితో మృతి చెందారు. గురువారం దూలపల్లిలో జరిగిన దశ దినకర్మకు వివిధ రాజకీయ పార్టీ నేతలు హాజరయ్యారు. ప్రొటోకాల్ పబ్లిక్ రిలేషన్, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల రావు దూలపల్లికి రావాల్సి ఉండగా.. అత్యవసర సమావేశంతో రద్దు కావడంతో ప్రత్యేక లేఖను టీపీసీసీ ప్రొటోకాల్ కమిటీ సెక్రెటరీ సూరజ్ ద్వారా పంపించారు. పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదానం చేశారు.

ట్రాన్స్‌జెండర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గడ్డం మల్లేష్

చింతల్: రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలబడి వాహనదారులను ఆకర్షించి ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ హెచ్చరించారు. కొంత కాలంగా జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలానగర్-నర్సాపూర్ రాష్ట్ర రహదారి పరిధిలో సాయంత్రం వేళల్లో స్థానికంగా ఉండే కొంత మంది ట్రాన్స్‌జెండర్లు రోడ్డుకు ఇరువైపులా నిలబడి వాహనదారులను ఆకర్షించి దోపిడీ చేసే ప్రయత్నం చేస్తున్నారన్న ఫిర్యాదు అందింది. దీంతో గురువారం పలువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

శభాష్ పోలీస్



వృద్ధుడిని రోడ్డు దాటిస్తున్న హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్

సుభాష్‌నగర్ : జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు విధులతోపాటు ఇతరుల పట్ల సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. విధులు నిర్వహిస్తున్న సమయంలో వాహనదారులకు, పాదచారులకు ఏ చిన్న సమస్య వచ్చినా స్నేహభావంతో పనిచేసే ఫ్రెండ్లీ పోలీస్‌గా ముందుకు వెళ్తున్నారు. చింతల్ ప్రధానదారి హ్యాపీ చిల్డ్రన్ హాస్పిటల్ వద్ద వృద్ధుడిని జీడిమెట్ల హైడ్రా ట్రాఫిక్ వాలంటీర్ రోడ్డు దాటిస్తుండగా సాక్షి కెమెరాకు చిక్కింది. ఇటీవల గ్రూప్-3 పరీక్షల్లో ఓ విద్యార్థిని అడ్రస్ తప్పిపోయి రాగా.. ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ 3 నిమిషాల్లో 3 కిలోమీటర్లు తీసుకెళ్లి పరీక్ష కేంద్రానికి చేర్చారు. అదేవిధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంపై జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులపై ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు.

దోమల నివారణకు చర్యలు



నీటి నిల్వలను తొలగిస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

కుత్బుల్లాపూర్: ఇంటింటికీ తిరుగుతూ దోమల నివారణపై ప్రచారం చేస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఎంటమాలజీ అధికారి ఉమారాణి అన్నారు. గురువారం పలు కాలనీల్లో దోమల నివారణకు రసాయన మందులను పిచికారీ చేశారు. జీడిమెట్ల డివిజన్ సుచిత్రలో పలు ఇళ్లల్లోని కుండీల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ, లార్వా ఎదుగుదల, దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజల్లో చైతన్యం వచ్చేలా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో వచ్చే ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరిస్తున్నామని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన అసోసియేషన్ సభ్యులతో శివాజీరాజు

కుత్బుల్లాపూర్: పేద క్షత్రియులను ఆదుకునేందుకే క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు పాత్తూరి శివాజీరాజు అన్నారు. గురువారం కొంపల్లిలో క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా దండు వరహాలరాజు, ఉపాధ్యక్షుడిగా భూపతిరాజు చిరంజీవి, కోశాధికారిగా సాగతిరాజు భానుకుమార్, సంయుక్త కార్యదర్శిగా హరిగోపాల్‌రాజు, సభ్యులుగా సుధీర్, నాగరాజులను నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివాజీరాజు మాట్లాడుతూ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న పేద క్షత్రియులకు విద్య, వైద్యం, ఉపాధి తదితర అంశాల్లో చేయూత నిచ్చేందుకు క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ కృషి చేస్తుందన్నారు. క్షత్రియ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.వర్మ రుద్రరాజు మాట్లాడుతూ.. ఈ కమిటీ 5 సంవత్సరాల పాటు సేవ అందిస్తుందని తెలిపారు.

పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలి

ఆల్విన్‌కాలనీ: వివిధ కాలనీల్లో ఏర్పడిన మంచి నీటి పైపులైన్ లీకేజీలకు మరమ్మతులు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. జలమండలి డీజీఎం నాగప్రియ, మేనేజర్ ఝాన్సీలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. ఈస్ట్ సాయినగర్, వెస్ట్ సాయినగర్, ఫేజ్ టు, ఎల్లమ్మ బండ, పీజేఆర్ నగర్ కాలనీ, మహంకాళినగర్ కాలనీల్లో మంచినీరు కలుషితమవుతుందని వివరించారు. నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మరమ్మతులు చేపట్టకుంటే ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమలాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కేశవరావు ఉన్నారు.



చింతల్ ద్వారకాపురి కాలనీలోని సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి సహిత వాయులింగ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం 7.30 గంటలకు స్థాపిక దేవతలకు పూజలు, 9.15 గంటలకు యంత్రపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతి భారతీ మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రతిష్ఠాపన చేశారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కామాక్షి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – కుత్బుల్లాపూర్

వృద్ధురాలి అదృశ్యం



రత్నాలమ్మ(ఫైల్)

నిజాంపేట్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన రత్నాలమ్మ(68) గురువారం మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓయూలో భూ భౌతిక శాస్త్రజ్ఞుల సమ్మేళనం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భూ భౌతిక శాస్త్రజ్ఞుల 46వ వార్షిక సమ్మేళనం ప్రారంభమైంది. గురువారం క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన సదస్సు, ఎగ్జిబిషన్‌కు ఏఈజీ ఉపాధ్యక్షులు ప్రొ.వీరయ్య అధ్యక్షత వహించగా పద్మశ్రీ ప్రొ.హర్ష కె గుప్తా ప్రారంభించారు. సదస్సుకు దేశ వ్యాప్తంగా 300 మంది సైంటిస్టులు హాజరుకాగా 50 పరిశోధన పత్రాలు ప్రదర్శించినట్లు ప్రొ.వీరయ్య తెలిపారు. అనంతరం సదస్సు సావనీరును ఆవిష్కరించారు. సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, కార్యణన్, వి.రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాకు తరలిన అంగన్‌వాడీలు



బాలానగర్: చలో ఇందిరాపార్కు ధర్నాకు హస్మత్‌పేట, ఎర్రగడ్డ, మూసాపేట, పర్వత్ నగర్‌లలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, యూనియన్ నాయకురాలు వసంతలక్ష్మి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం టీచర్‌కు రూ.18 వేలు, హెల్పర్‌కి రూ.12 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. 11 నెలల అద్దెలు, కూరగాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సారిక, శ్వేత, రజిత, హేమ, రమ, సంగీత, శశికళ, శారద, పద్మ, శాలిని, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న దళిత సంఘాల సభ్యులు

నిజాంపేట్: అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించాలని గురువారం నిజాంపేట్ దళిత సంఘాల ఐక్యవేదిక ప్రెసిడెంట్ మేకల నాగేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ సర్వే నెంబరు 82లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఈ ప్రాంతంలో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ భవన నిర్మాణం పూర్తయితే సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు సమావేశాలు నిర్వహించేందుకు వీలు కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో చంద్రయ్య, అబ్రహం, రాములు, బాలపీరు, యాదగిరి, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యమెందుకు?

స్తంభాలు తొలగించకుండానే రోడ్డు పనులు





సర్కిల్ కార్యాలయం ముందు నుంచి నూతనంగా వేసిన రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

కుత్బుల్లాపూర్: అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ముందస్తుగా ఆ రోడ్డుపై ఉన్న అడ్డంకులను తొలగించిన తర్వాత కాంట్రాక్టర్‌తో రోడ్డు వేయించాలి. కానీ కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ముందు ఉన్న రోడ్డు పనులను అందుకు విరుద్ధంగా పూర్తి చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి వేస్తున్న రోడ్ల మధ్యలో ఉన్న విద్యుత్ పోల్స్ తొలగించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పక్కనే ఉన్న పాత రోడ్డుపైనే వాహనాల రాకపోకలు సాగిస్తుండటం, తాజాగా వేసిన రోడ్డుపై పార్కింగ్ చేస్తుండటం విశేషం. విద్యుత్ స్తంభాలను తొలగించే క్రమంలో సిమెంట్ రోడ్డు పగుళ్లు ఏర్పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని కోరుతున్నారు.



సుభాష్ నగర్ పైపులైన్ రోడ్డులో నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది. జీడిమెట్ల పరిశ్రమల యజమానులు రోడ్డు పక్కనే భారీ వాహనాలను పార్కింగ్ చేయడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఆ రోడ్డులో ఇరుక్కుపోతున్నాయి. దీంతో ముందుకు కదలలేక.. వెనక్కి వెళ్లలేక గంటల రాకపోకలు స్తంభిస్తున్నాయి. ముఖ్యంగా కాంట సమీపంలో ఎక్స్ రోడ్డు ఉండడం.. అటు ఇటు భారీ వాహనాల రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో ఇక్కడ ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. – కుత్బుల్లాపూర్

హ్యాండ్ బాల్, ఖోఖో జట్లను అభినందించిన ఇన్‌చార్జి వీసీ



క్రీడాకారులను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ

కేపీహెచ్‌బీకాలనీ: అనురాగ్ యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇంటర్ ఇంజనీరింగ్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొన్న పురుషుల జట్టు ప్రథమ స్థానం సాధించింది. అదే విధంగా శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ నేషనల్ లెవెల్ ఖోఖో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జేఎన్‌టీయూహెచ్ పురుషుల జట్టు కూడా ప్రథమ స్థానం సాధించింది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన రెండు జట్లను ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి గురువారం అభినందించారు. యూనివర్సిటీలో క్రీడల ప్రోత్సాహానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర‌రావు, స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్లగొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగించాలని వినతి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌కు చెందిన వీఎస్ఆర్ హైట్స్ అపార్ట్‌మెంట్ పక్క స్థలంలో పర్వతనగర్‌కు చెందిన కళ్యాణ్‌నాయక్ అపార్ట్‌మెంట్‌కు ఆనుకుని అక్రమ నిర్మాణం చేపడుతున్నాడు. దీంతో గురువారం అపార్ట్‌మెంట్ వాసులు డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణం వల్ల తమ గోడలు పాడవడంతో తాము హైకోర్టుకు వెళ్లామని, కోర్టు వారు నిర్మాణాన్ని నిలిపి వేయాలని, అప్పటి వరకు జరిగిన కట్టడాన్ని తొలగించాలని నోటీసు ఇచ్చారని తెలిపారు. కానీ కళ్యాణ్ నాయక్ స్థానిక ప్రజా ప్రతినిధుల అండదండలతో తన అక్రమ నిర్మాణాన్ని కొనసాగిస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.